క్లుప్తంగా

నడిరోడ్డుపై గుంత


బీజేఆర్ చౌరస్తాలో ఏర్పడ్డ గుంత

వికారాబాద్ అర్బన్: పట్టణంలోని బీజేఆర్ చౌరస్తా వద్ద రోడ్డుపై పెద్ద గుంత ఏర్పడింది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు దెబ్బతిని గుంత ప్రమాదకరంగా మారింది. ఎప్పుడు వాహనాలతో రద్దీగా ఉండే బీజేఆర్ చౌరస్తాలో గుంత ఉండటంతో వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి గుంతను పూడ్చివేయాలని వాహనదారులు కోరుతున్నారు.

కురుమ సంఘం అధ్యక్షుడిగా జగదీశ్


జగదీశ్‌ను సన్మానిస్తున్న కురుమ సంఘం నాయకులు

తాండూరు టౌన్: కురుమ సంఘం తాండూరు పట్టణాధ్యక్షుడిగా కుర్వ జగదీశ్, ప్రధాన కార్యదర్శిగా భానుతేజను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కోహిర్ శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షుడు జగదీష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంఘం తరుపున కురుమల అభివృద్ధికి తమవంతు సహకారం అందజేస్తామన్నారు. తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన కులపెద్దలకు, సంఘం బాధ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి: ఏఎస్ఐ


అవగాహన కల్పిస్తున్న ఏఎస్ఐ అంజాద్

బంట్వారం: వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఏఎస్ఐ అంజాద్ సూచించారు. శుక్రవారం బంట్వారం పోలీస్ స్టేషన్ సమీపంలో ఆయన రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ప్రతి వాహనదారుడు ఆర్సీ, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపరాదన్నారు. నిబంధనలు అతిక్రమించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కోత్లాపూర్ జాతర షురూ


ఆలయంలో భక్తుల రద్దీ

తాండూరు రూరల్: మండల పరిధిలోని కోత్లాపూర్ శివారులో ఉన్న శ్రీ రేణుకా ఎల్లమ్మ జాతర శుక్రవారం ప్రారంభమైంది. ఈ జాతరకు మండలం నుంచే కాకుండా కర్ణాటక నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల కోర్కెలు తీర్చే రేణుక ఎల్లమ్మగా ప్రసిద్ధి. జాతరకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ సందీప్‌రెడ్డి, సర్పంచ్ సాయిలు, ఈఓ శేఖర్‌గౌడ్, ధర్మకర్తల మండలి సభ్యులు సురేష్, వెంకటప్ప, మొగులప్ప, లక్ష్మీ, శ్యామలీల, పద్మమ్మ పాల్గొన్నారు.

మొరంగపల్లిలో కంటి వెలుగు శిబిరం

మోమిన్‌పేట: కంటి వెలుగు శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ పన్నాల శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మొరంగపల్లి గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కంటి పరీక్షలకు అనుగుణంగా అద్దాలు, అవసరమైనవారికి ఉచితం శస్త్రచికిత్సలు చేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి బ్రిజిలిల్, కార్యదర్శి మాధవి, వైద్య సిబ్బంది ఉన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి

తాండూరు రూరల్: యువకులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కోటబాసుపల్లి సర్పంచ్ కుర్వ నాగర్జున అన్నారు. కోటబాసుపల్లి గ్రామంలో గుర్రంపల్లి భీమయ్య, బసమ్మ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు, యువకులు ఫోన్‌లకు దూరంగా ఉండాలన్నారు. క్రికెట్‌తోపాటు కబడ్డీ, టెన్నీస్, వాలీబాల్ వంటి ఔట్‌డోర్ గేమ్స్ ఆడాలన్నారు. గుర్రంపల్లి పెద్ద అనంతయ్య ప్రోత్సాహంతో మొదటి బహుమతి రూ.25 వేలు, రెండో బహుమతి రూ.15వేలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ మొగులప్ప, ఆర్గనైజర్ నరేష్ తదితరులు ఉన్నారు.

అరకొర కోటాతో అవస్థలు

- గుండాల రేషన్ దుకాణం ఎదుట కార్డుదారుల ఆందోళన
- 143 క్వింటాళ్లకు గాను 76 క్వింటాళ్ల బియ్యం పంపిణీ
- సమీప గ్రామాలకు వెళ్లి రేషన్ తెచ్చుకోవాల్సిన పరిస్థితి


రేషన్ దుకాణం ఎదుట ఆందోళన చేపడుతున్న కార్డుదారులు

దోమ: కార్డులకు సరిపడా రేషన్ బియ్యం అందించాలంటూ మండల పరిధిలోని గుండాల గ్రామంలోని రేషన్ దుకాణం ఎదుట గ్రామస్తులు చేపట్టిన ఆందోళన కార్యక్రమాలు రెండోరోజూ కొనసాగాయి. ఇన్‌చార్జి రేషన్ డీలర్ ఉన్నకోటా నుంచి గ్రామస్తులకు రేషన్ బియ్యం ఇవ్వడానికి శుక్రవారం రేషన్ దుకాణం తెరిచేందుకు యత్నించగా గ్రామస్తులు అడ్డుకున్నారు. తమ కోటా పూర్తిస్థాయిలో వచ్చే వరకు దుకాణాన్ని తెరవొద్దంటూ డీలర్‌ను నిలదీశారు. స్థానికంగా సరిపడా బియ్యం దొరకనందున వేరే గ్రామాల రేషన్ దుకాణాలకు వెళ్లి బియ్యం కోటా తెచ్చుకుంటున్నామని వాపోయారు.

కోటా పంపిణీలో నిర్లక్ష్యం..

గుండాల గ్రామానికి రేషన్ బియ్యం కోటాను పంపిణీ చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవరిస్తున్నారని గ్రామస్తులు మండిపడుతున్నారు. గ్రామానికి సంబంధించి సుమారు 500 రేషన్ కార్డులు ఉన్నాయి. వాటికి ప్రతినెలా 143 క్వింటాళ్ల రేషన్ బియ్యం పంపిణీ చేయాల్సి ఉంది. అయితే కేవలం 76 క్వింటాళ్ల రేషన్ బియ్యం మాత్రమే పంపిణీ చేయడంతో గ్రామస్తుల్లో సగం కార్డులకు పైగా రేషన్ అందడంలేదు. ఈ గ్రామానికి చెందిన రేషన్ షాపు డీలర్ సర్పంచ్‌గా ఎన్నిక (గత సర్పంచ్ ఎన్నికల్లో) కావడంతో డీలర్‌షిప్‌ను వదులుకున్నాడు. అప్పటినుంచి ఆ పోస్టు ఖాళీగానే ఉంది. ఈ క్రమంలో అధికారులు బట్లచందారం గ్రామానికి చెందిన డీలర్‌కు ఇన్‌చార్జి డీలర్‌గా బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆ డీలర్ ప్రతినెలా గ్రామానికి వచ్చి కోటాను పంపిణీ చేస్తున్నాడు. అయితే 143 క్వింటాళ్లకు గాను కేవలం 76 క్వింటాళ్ల కోటా మాత్రమే వస్తుండటంతో సగంమందికి మాత్రమే బియ్యం పంపిణీ చేస్తన్నాడు. మిగితావారు పక్క గ్రామం నుంచి కోటా తెచ్చుకోవాల్సిందిగా చెప్పుండటంతో గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగానే పూర్తి కోటా తెప్పించి కార్డుదారులకు అందించాలని వారు కోరుతున్నారు.

కోటా బియ్యం పక్కదారి..!

గ్రామాల్లో అందిస్తున్న రేషన్ బియ్యం పంపిణీ విషయంలో అవకతవకలు జరుగుతున్నాయనేది బహిరంగ రహస్యమే. గతంలో దాదాపూర్ డీలర్‌కు గుండాల బాధ్యతలు ఇవ్వగా ఆ డీలర్ తన దుకాణంతో పాటు గుండాల దుకాణంలో 25 నుంచి 30 క్వింటాళ్ల వరకు బియ్యం పక్కదారి పట్టిస్తుండగా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దాడుల్లో పట్టుబడినట్లు సమాచారం. ఈ కారణంగానే దాదాపూర్ డీలర్‌ను గుండాల ఇన్‌చార్జి డీలర్ బాధ్యతల నుంచి తొలగించి బట్లచందారం డీలర్‌కు బాధ్యతలు ఇచ్చినట్లు సమాచారం. అయిఏత సరిపడా కోటా బియ్యం ఇవ్వకపోడంపై ప్రజలు మండిపడుతున్నారు. సంబంధిత అధికారులు తమ గ్రామానికి పూర్తిస్థాయిలో డీలర్‌ను నియమించి గ్రామస్తులందరికి రేషన్ బియ్యం అందేలా చర్యలు తీసుకోవాలని గుండాల గ్రామస్తులు కోరుతున్నారు.

పూర్తి కోటా అందిస్తాం



గుండాల గ్రామంలో సరిపడా రేషన్ కోటా పంపిణీ కావడంలేదన్న విషయం మా దృష్టికి వచ్చింది. ఇప్పటినుంచి గ్రామంలో పూర్తి స్థాయి కోటా బియ్యం పంపిణీ చేయించి రేషన్‌కార్డుదారులకు అందజేస్తాం. పూర్తి కోటా అందించినప్పటికీ కార్డుదారులకు బియ్యం అందకపోతే ప్రస్తుతం ఉన్న ఇన్‌చార్జి డీలర్‌ను తొలగించి వేరే డీలర్‌కు బాధ్యతలు అప్పగిస్తాం. అందరికీ రేషన్ అందేలా చూస్తాం.

– షాహెదా బేగం, తహసీల్దార్, దోమ

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తాం

ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి


క్రీడాకారులతో కరచాలనం చేస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

కుల్కచర్ల: గ్రామీణ క్రీడాకారులను అన్నివిధాల ప్రోత్సహిస్తామని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కుల్కచర్ల మండలం సుభ్యానాయక్ తండాలో క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... యువత ప్రతిరోజు క్రీడలకు సమయం కేటాయించాలన్నారు. క్రీడల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, రైతుబంధు మండల అధ్యక్షుడు రాజు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శేరిరాంరెడ్డి, నాయకులు రాజు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

జేపీఎస్‌లను క్రమబద్ధీకరించండి

బీజేపీ, సీపీఐ నాయకుల డిమాండ్

తాండూరు రూరల్: కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగులు తీవ్ర నిరాశకు గురవుతున్నారని, నాలుగేళ్లుగా పంచాయతీ కార్యదర్శుల చేత రాష్ట్ర ప్రభుత్వం వెట్టిచాకిరి చేయిస్తోందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్ ఆరోపించారు. శుక్రవారం జేపీఎస్‌ల సమ్మెకు మద్దతు తెలిపిన ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ.. ప్రొబేషనరి పీరియడ్ ముగిసినా కార్యదర్శులను పర్మినెంట్ చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుందని, వెంటనే వారిని రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించే వరకు తాము నిరసన తెలియజతూనే ఉంటామన్నారు. ప్రభుత్వ పెద్దలు త్వరగా తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రతినిధులు రజినీకాంత్, పాండు, శ్రీలత, సుదర్శన్‌గౌడ్, మహిపాల్, జేపీఎస్‌లు లాలప్ప, అశోక్, కేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేటలో..

బొంరాస్‌పేట: ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరుతూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేస్తున్నచేపట్టిన సమ్మె శుక్రవారానికి ఏడోరోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా నిరసనకు మద్దతు తెలుపుతూ సీపీఐ నాయకుడు గంటి సురేశ్‌కుమార్ మాట్లాడారు. నాలుగేళ్ల కాలపరిమితి ముగిసిన కార్యదర్శులను వెంటనే పర్మినెంట్ చేయాలని డిమాండ్‌చేశారు. కార్యదర్శులను పర్మినెంట్ చేసే విషయంలో ప్రభుత్వం కాలయాపన చేయడం తగదన్నారు. వెంటనే వారి డిమాండ్లను పరిష్కరించడంతో పాటు వారి ప్రొబెషనరీని పూర్తిచేసి నియామక పత్రాలు అందించాలనలనారు. రవికుమార్, సంపత్, శివలింగప్ప, నక్షత్ర, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

సర్పంచ్ నారాయణమ్మ


యాలాల: నోటుబుక్కులతో విద్యార్థులు

యాలాల: మండల పరిధిలోని జక్కేపల్లిలో గ్రామానికి చెందిన కుర్వ మల్లేశం శుక్రవారం విద్యార్థులకు ఉచితంగా నోటుబుక్కులు, పెన్సిళ్లను పంపిణీ చేశారు. ఇటీవల పాఠశాలలో వేసవి పఠన శిబిరం ఏర్పాటు చేయడంతో తనవంతుగా సహాయం చేసినట్లు ఆయన తెలిపారు. విద్యార్థులను ప్రొత్సహించేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని గ్రామ సర్పంచ్ నారాయణమ్మ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం లీలావతి, గణేష్, మహిపాల్, నర్సింహారెడ్డి, మల్లప్ప, మల్కప్ప, వెంకటయ్య, రాములు ఉన్నారు.

విద్యార్థులకు పండ్ల పపిణీ..

దోమ: విద్యార్థులు వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఉప సర్పంచ్ రఫీక్ పాష తెలిపారు. శుక్రవారం దోమ మండల పరిధిలోని బొంపల్లి గ్రామంలో విద్యార్థులకు గ్రామ వార్డు సభ్యుడు శేఖర్‌తో కలసి పండ్లు పంపిణీ చేశారు. వేసవి శిబిరంలో ప్రతి విద్యార్థికి రాయడం, కథలు, పాటలు, పద్యాలు నేర్పించడంపై దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు ఎలాంటి అవసరం ఉన్నా తనను సంప్రదించాలన్నారు. విద్యార్థులు శిబిరాల్లో ఉపాధ్యాయులు చెప్పినవి శ్రద్ధగా వినాలన్నారు.

దళారుల చేతుల్లో మోసపోవద్దు

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవంలో బీఆర్ఎస్ నేతలు


దౌల్తాబాద్: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

దౌల్తాబాద్: దళారులకు ధాన్యం విక్రయించి నష్టపోవద్దని.. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని ఎంపీపీ విజయ్‌కుమార్, జెడ్పీటీసీ మహిపాల్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భీములు అన్నారు. శుక్రవారం మండలంలోని దేవర్‌ఫస్‌వాద్, గోకఫసల్‌వాద్, నందారం గ్రామాల్లో పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించారు. రైతులకు కేంద్రాల వద్ద ఇబ్బందులు రాకుండా చూడాలని నిర్వాహకులను కోరారు. పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, సీఈఓ అనంతయ్య, కోఆప్షన్ మెంబర్ జాకీర్, సర్పంచ్ లక్ష్మీదేవి, ఎంపీటీసీ కేశవరెడ్డి తదితరులున్నారు.

బొంరాస్‌పేటలో..

బొంరాస్‌పేట: ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ చౌహాన్ అరుణదేశు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీపీ హేమీబాయితో కలిసి ఆమె ప్రారంభించారు. ప్రభుత్వ కొనుగోలు కేందాల్లోనే ధాన్యం విక్రయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ శేరినారాయణరెడ్డి, ఎంపీటీసీ శ్రావణ్‌కుమార్, నాయకులు యాదగిరి, మహేశ్, ఏఈఓ స్వాతి, ఏపీఎం అంజిలయ్య, కొనుగోలు కేంద్ర ఆపరేటర్లు రాములు, మల్లయ్య, వీబీకేలు పాల్గొన్నారు.

'ఇంటర్ సిటీ'కి మర్పల్లి రైల్వేస్టేషన్‌లో హాల్ట్

మర్పల్లి: బీదర్ నుంచి ప్రతిరోజు ఉదయం హైదరాబాద్, హైదరాబాద్ నుంచి ప్రతిరోజు సాయంత్రం బీదర్ వరకు దక్షణ మధ్య రైల్వే నడిపే ఇంటర్ సిటీ రైలు ఈనెల 9వ తేదీ నుంచి మర్పల్లి రైల్వే స్టేషన్‌లో ఆగనుందని ఇంటర్ సిటీ సాధన సమితి సభ్యులు వెంకటేశం, నర్సింహులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారు మాట్లాడుతూ.. ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ రైలుకు మర్పల్లి రైల్వే స్టేషన్‌లో హాల్టు ఇవ్వాలంటూ రైలు ప్రారంభించిన రోజు నుంచి మండలస్థాయి ప్రజాప్రతి నిధులు, ఆయా పార్టీల రాజకీయ నాయకులు అధికారుల దృష్టికి తీసుకుపోవడం జరిగిందన్నారు. మండల ప్రజల నిరంతర విజ్ఞప్తి మేరకు, ప్రజాప్రతి నిధుల పోరాటం ఫలితంగా ఇంటర్ సిటీ రైల్‌ను మర్పల్లి రైల్వే స్టేషన్‌లో ఆపేందుకు ప్రత్యేకంగా అనుమతులు తీసుకున్న దక్షిణ మధ్య రైల్వే శాఖ అధికారులకు, రాజకీయ పార్టీల నాయకులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. 9వ తేదీన మొదటిసారిగా ఇంటర్ సిటీ రైల్ మర్పల్లి స్టేషన్‌లో ఆపుతున్నందున రైల్వేశాఖ ఉన్నతాధికారులు మర్పల్లి రైల్వేస్టేషన్‌కు వస్తున్నారని అందుకు గాను మండల ప్రజల తరుపున సన్మాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. పార్టీలకతీంగా నాయకులు పాల్గొనాలన్నారు. ఇకనుంచి ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ఈ ట్రైన్ మర్పల్లి రైల్వేస్టేషన్‌లో ఆగనుందని అన్నారు.

నేడు సీపీఐ నియోజకవర్గ స్థాయి సమావేశం

కొడంగల్ రూరల్: భారత కమ్యూనిస్టు పార్టీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం శనివారం ఉదయం 11గంటలకు బాలాజీనగర్‌లో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఇందనూర్ బషీర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి గ్రామ, మండల శాఖ కార్యకర్తలు, నాయకులు, కమిటీ సభ్యులు హాజరుకావాలని కోరారు. పార్టీ బలోపేతానికి క్షేత్రస్థాయిలో అనుసరించాల్సిన విధానాలపై చర్చించనున్నట్లు తెలిపారు.

నేడు సర్వసభ్య సమావేశం

కొడంగల్: కొడంగల్ మండల సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ ముద్దప్ప అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పాండు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు. పంచాయతీల్లో ఉన్న సమస్యలు, పరిష్కారాలపై సమగ్రంగా చర్చించనున్నట్లు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

పెద్దేముల్: పెద్దేముల్ మండల గాజీపూర్ గ్రామానికి చెందిన మొహీద్ అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరగా.. ఆర్థికసాయం కోసం ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్చారీ సహకారంతో సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. ఈ మేరకు మంజూరైన రూ.లక్ష చెక్కును గాజీపూర్ గ్రామంలో శుక్రవారం సర్పంచ్ వీరప్ప.. మొహీద్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రవికుమార్, మండల కోఆప్షన్ సభ్యుడు నసీర్, ఉప సర్పంచ్ వెంకటయ్య, గ్రామస్తులు శ్రీనివాస్‌రెడ్డి, నరేష్, సంఘమేశ్వర్, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

హిందువుల మనోభావాలు దెబ్బతీస్తే సహించం: బీజేపీ

పరిగి: హిందువుల మనోభావాలు దెబ్బతీసే విధంగా ఎవరు మాట్లాడినా సహించబోమని బీజేపీ నేతలు హెచ్చరించారు. కర్ణాటక రాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో హిందువుల మనోభావాలు దెబ్బతీసే విధంగా కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో భజరంగ్‌దళ్‌ని నిషేధిస్తామని చేర్చడంతో జిల్లా బీజేపీ నేతలు శుక్రవారం పరిగి పట్టణంలోని డీసీసీ అధ్యక్షుడి టి.రామ్మోహన్‌రెడ్డి ఇంటి ఎదుట హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ ఒక వర్గం ఓట్లను దండుకోవడానికి హిందువుల మనోభావాలను కించపరుస్తోందన్నారు. బీజేపీ శ్రేణులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

వడ్డెరుల సమస్యలు పరిష్కరించండి

అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పూడూరు: వడ్డెరుల సమస్యలు పరిష్కారించాలని అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు వడ్డె మల్లేశం డిమాండ్ చేశారు. గ్రామాల్లో వడ్డెరులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారించాలని కోరుతూ శుక్రవారం పూడూరు తహసీల్దార్ మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందదర్భంగా మల్లేశం మాట్లాడుతూ.. గ్రామాల్లో వడ్డెర కమ్యూనిటీ భవనాలకు స్థలాలు కేటాయించడంతో పాటు రాయి పని చేసుకునేందుకు ఐదెకరాల ప్రభుత్వ భూమిని ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హులైన వడ్డెరలకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు, పనిముట్లు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం ఉపాధ్యక్షుడు రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి గణేశ్, కార్యదర్శులు కాశీనాథ్, వెంకటయ్య, కోశాధికారి నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

అల్లాపూర్‌లో బోర్‌మోటారు ప్రారంభం

కుల్కచర్ల: వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నామని అల్లాపూర్ సర్పంచ్ శివిబాయి అన్నారు. శుక్రవారం కుల్కచర్ల మండలం అల్లాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో నూతన బోరుమోటారును ఆమె ప్రారంభించారు. వేసవి నేపథ్యంలో గ్రామస్తులు తాగునీటికి ఇబ్బందికి గురికావద్దన్న ఉద్దేశంతో బోరుమోటరు ద్వారా నీటిని అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ఉమ్లా, వెంకట్, కాళిదాస్, నాగ్య, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

బషీరాబాద్: మండలంలోని పర్వత్‌పల్లి గ్రామంలో లక్ష్మీదేవి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన అల్లాపూర్ లక్ష్మీ, శ్రీనివాస్‌రెడ్డి దంపతులు గ్రామ సమీపంలోని తమ పొలంలో గతంలో లక్ష్మీ మాత వెలిసిందని తెలిపడంతో అదే స్థలంలో గుడిని నిర్మించారు. గ్రామస్తులు అమ్మవారి విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. పాండురంగారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, అల్లాపూర్ రామ్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఎంఆర్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

పరిగి: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి తనయుడు అవినాష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పరిగి పట్టణంలోని మినీ స్టేడియంలో బీఎంఆర్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. పోటీల్లో విజేత జట్టుకు రూ.2 లక్షలు, రన్నరప్ జట్టుకు రూ.2 లక్షలు తమవంతు సహాయంగా ఇవ్వనున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఎమ్మార్ సభ్యులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు స్వయం ఉపాధితో ఎదగాలి


సర్టిఫికెట్లు అందుకున్న మహిళలతో చైర్‌పర్సన్ స్వప్న, అతిథులు

మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న

తాండూరు టౌన్: స్వయం ఉపాధితో మహిళలు ఆర్థికంగా ఎదగాలని తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న అన్నారు. నాబార్డు ఆధ్వర్యంలో అమ్మ ఆదరణ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సునీత నేతృత్వంలో స్థానిక విలియంమూన్ పాఠశాలలో 45రోజుల పాటు కంప్యూటరైజ్డ్ ఎంబ్రాయిడరీ శిక్షణ కొనసాగింది. శుక్రవారం శిక్షణ ముగియడంతో సర్టిఫికెట్లు అందజేసే కార్యక్రమానికి చైర్‌పర్సన్ ఆహ్వానించారు. సర్టిఫికెట్లు అందజేసిన అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా పలు నైపుణ్య విభాగాల్లో మహిళలకు శిక్షణ ఇస్తోందని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్థికంగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజుగౌడ్, బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సాహు శ్రీలత, లీడ్ బ్యాంకు మేనేజర్ రాంబాబు, నాబార్డు డీడీఎం ప్రవీణ్, ఎస్బీ సీఎస్పీ ఆనంద్, శిక్షకులు మమత, స్వర్ణభారతి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గౌతమ బుద్ధుడి జయంతి


బుద్ధుడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కొడంగల్ రూరల్: పట్టణంలోని నవీన ఆదర్శ ప్లే హైస్కూల్ సిబ్బంది శుక్రవారం గౌతమ బుద్ధుని జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఫౌండర్ డి.వెంకటయ్య, ప్రిన్స్‌పాల్ నరేష్‌రాజ్, సమ్మర్ క్యాంపు విద్యార్థులు గౌతమ బుద్ధుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. గౌతమ బుద్ధుడి చరిత్రను విద్యార్థులకు వివరించారు. పాఠశాలలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులో స్పోకెన్ ఇంగ్లిష్, బేసిక్ ఫౌండేషన్ ఇన్ ఆల్ సబ్జెక్ట్స్, ఇంగ్లీష్ గ్లామర్ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం

ధారూరు: ధారూరు మండలంలోని నాగ్‌సాన్‌పల్లి గ్రామ ప్రధాన రోడ్డు పక్కనే ఓ విద్యుత్ స్తంభం పంటపొలాల్లోకి వంగిపోయి ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డులో నిత్యం పెద్ద సంఖ్యలో వాహనాలు వెళ్తుంటాయి. విద్యుత్ స్తంభం పొలం వైపు వంగి ఉండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం సంభవించకముందే స్తంభాన్ని సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు.


నాగ్‌సాన్‌పల్లి రోడ్డులో ఒరిగిన విద్యుత్ స్తంభం